నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్, డిసెంబర్ 26 : మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలోని పలు ఫీడర్ల పరిధిలో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఏఈ దీపి తెలిపారు. ప్రేమ్ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ప్రేమ్ నగర్, న్యూ హఫీజ్‌పేట్, సీఎం తోట సమీపంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు,11 కేవీ హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని మైత్రి నగర్, ఆల్విన్ కాలనీ, కల్కి అపార్ట్‌మెంట్స్, మదీనాగూడ విలేజ్ పార్ట్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 11 కేవీ ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, సమత కో – ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ తెలిపారు.

మియాపూర్ : 11 కేవీ శేషాద్రినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు నిమిత్తం ప్రకాశ్ నగర్, శేషాద్రినగర్, వెంకట్రావ్ నగర్, సాయిబాబా నగర్, టవర్ లైన్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ చైతన్య గురువారం తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

మియాపూర్ , డిసెంబర్ 26 : ఓ మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసు దొంగిలించిన ఘటన కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని రోడ్ నం. 29 సాయితేజ టవర్స్‌లో నివసించే మేక మణి పండ్లు కొని ఇంటికి వెళ్తున్నక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును చోరీ చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వర్‌రావు గురువారం తెలిపారు.

● కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని శ్రీనివాసనగర్‌లో బీఎంఆర్ హైట్స్‌లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.42,420 నగదుతో పాటు ఏడు చరవాణిలు, 9 సెట్ల కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా..

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 26 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సత్వర చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం పేట్ బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యూనియన్ల ప్రతినిధులు హాజరై తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. ఆయా విభాగాల అధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి, సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

దుండిగల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను తెలియజేసి పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని, ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు తాము నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలకు రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

అల్లాపూర్ : ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతంనగర్ అన్సారి సొసైటీలో 210 గజాల స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులకు గురువారం పండాల సతీశ్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీవాసులు అభివృద్ధి పనులకోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే శుభకార్యాలు చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. భవన నిర్మాణానికి తనవంతు సాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ గౌస్, ఎండీ యూసఫ్, ఖలీల్, గోరేమియా, ఎండీ నిస్సార్ అహ్మద్,ఎండీ మాజీద్,ఎండీ అక్రం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును తన కార్యాలయంలో కలిసి సమస్యలు తెలుపుతున్న స్థానికులు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన నియోజకవర్గ ప్రజలు

కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

సీనియర్లను సన్మానిస్తున్న స్థానిక సీపీఐ నాయకులు

దుండిగల్ : భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) వ్యవస్థాపక శతాబ్ది ఉత్సవాలు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించారు. బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద, నిజాంపేట్‌లోని రాజధాని స్కూల్ వద్ద కార్యక్రమానికి సీపీఐ నిజాంపేట్ శాఖ కార్యదర్శి ఆశీ యాదయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, సీపీఐ నాయకులు జగన్నాథం హాజరయ్యారు. సీనియర్ నాయకులు వెంకటరామయ్య జెండా ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ.. సీపీఐని 1925 డిసెంబర్ 26 ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో అధికారికంగా ఏర్పాటు చేశారన్నారు. స్వాతంత్ర్యం రాక ముందే బ్రిటీష్ పాలకులు మీరట్‌లో 33 మంది కమ్యూనిస్టులపై కుట్రకేసులు పెట్టి జైలు శిక్ష విధించారని గుర్తుచేశారు. అనంతరం నిజాంపేటకు సంబంధించిన సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ జగన్నాథం, కామ్రేడ్ ఖాసీం, కామ్రేడ్ చెన్నారెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాజీ మెంబర్ ఢిల్లేశ్వర్‌రావు, వాసు, దుర్గయ్య, మోహన్‌రెడ్డి, పరమేశ్, జితేందర్, నర్సమ్మ, మల్లమ్మ, పద్మమ్మ, శారద పాల్గొన్నారు.

29న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 26 : విజయ్‌నగర్ కాలేజీ ఆఫ్ కామర్స్‌లో 1978నుంచి 2004వరకు ఎకనామిక్స్ అధ్యాపకురాలిగా విశిష్ట సేవలందించిన భవానిదేవి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని మాసబ్ ట్యాంకు మహావీర్ ఆసుపత్రి ఎదురుగా గల జెఎన్ఏఎఫ్ఏయూలోని ఆడిటోరియంలో డిసెంబర్ 29నఆదివారం ఉదయం 10గంటలకు ఏర్పాటు చేయనునట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను విద్యాబోధనలతో తీర్చిదిద్దిన విద్యార్థులను, తనతో పనిచేసిన అధ్యాపకులను, సిబ్బందిని కలవడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్

రామంతాపూర్ : రాచకొండ పోలీ స్ కమిషరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఇన్‌స్పెక్టర్లు మల్లే శ్,బాబ్యానాయక్ ఆధ్వర్యం లో నిర్వహించిన డ్రైవ్ లో సైలెన్సర్లతో భారీ ఎత్తున శబ్దకాలుష్యానికి గురి కావడమే కాకుండా వాహన దారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా బైకర్లపై చర్యలు తీసుకున్నారు.అలాంటి ద్విచక్ర వాహనాలను గుర్తించి సైలెన్సర్లను తొలగించారు. అంతే కాకుండా వెయ్యిరూపాయల జరిమానా విధించారు.కొత్త సైలెన్సర్లను అమర్చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రెండోసారి పట్టుబడితే చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశ పెడుతామన్నారు.చట్టపరమైన చర్యలుంటాయన్నారు.నూతన సంవత్సర వేడుకలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.ఈకార్యక్రమంలో ఎస్ఐలు రమేశ్, నరేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

రవీంద్రభారతి, డిసెంబర్ 26 : కళానృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి అకాడమీ 16 వ వార్షికోత్సవవాల సందర్భంగా కళానృత్య నికేతన్ అధ్యక్షురాలు నాట్యగురువు డాక్టర్ బిందు అభినయ్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళానృత్యనికేతన్ సంస్థను 2007లో స్థాపించి హైదరాబాద్ నగరం మంతా వివిధ శాఖలుగా విస్తరించి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 146మంది ప్రదర్శించిన కూచిపూడి నృత్యం వీక్షకులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పద్మజారెడ్డి, భాగవతుల సేతురామ్, కళాకృష్ణ, పద్మశ్రీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అక్రమపాలన నడుస్తున్నది

కాప్రా, డిసెంబర్ 26: ఆరు గ్యారంటీల అమలును పక్కనపెట్టి అక్రమ అరెస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని కాప్రాసర్కిల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఏఎస్‌రావునగర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు కాసం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేశారని మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో జరిగే అక్రమాలపై ఎక్కడ ప్రభుత్వాన్ని నిలదీసినా బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును మహిపాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్‌పార్టీ ఏడాది పాలనపై, ప్రభుత్వంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మొదలైందని అన్నారు. ఇలాగే ఖూనీ పాలన నడిస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు.

రేపు వాహనాల వేలం

మల్కాజిగిరి : ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ఏడు వాహనాలను 28న ఉదయం 11గంటలకు వేలం వేస్తున్నట్లు మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మల్కాజిగిరిలోని ఆనంద్‌బాగ్ శివపురి కాలనీలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అవరణంలో 5 ద్విచక్రవాహనాలు, వ్యాగనార్ కారు, ఆటో వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.2వేల డిపాజిట్‌తో పాటు ఏదైన గుర్తింపు కార్డు తీసుకుని రావాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్ 8712658737, 9533551949లో సంప్రదించాలని కోరారు.

శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠం పరిధిలోకి
శ్రీమాతా నిమిషాంబికా దేవి ఆలయం

బోడుప్పల్, డిసెంబర్26: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీమాతా నిమిషాంబికాదేవి ఆలయం శ్రీహంపీ విరూపాశ్రీ విద్యారణ్య పీఠం ఆధీనంలోకి చేరింది. ఇకపై హంపీ పీఠం ఆద్వర్యంలో అమ్మవారికి నిర్వహించే అన్నిరకాల పూజా క్రతువులు కొనసాగనున్నాయి. శ్రీహంపీ విరూపాశ్రీ విద్యారణ్య మహాప్రస్థానం కింద భక్తులకు వివిధ రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రతిరోజూ ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12:30 వరకు సాయంత్రం 5:30 నుంచి రాత్రి 8:30గంటలవరకు ఆలయం తెరిచిఉంటుందని ఆలయ కార్యనిర్వాహకులు శ్రీనివాస్‌రావు వెల్లడించారు.జనవరి1న గత సంవత్సరం అమ్మవారికి సమర్పించిన చీరలను ఆలయ ప్రాగణంలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కామరౌత్ వినోద్‌కుమార్ తెలిపారు.

రేపు రతన్‌టాటా
ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ : తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డు బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో డిసెంబర్ 28న శనివారం ఉదయం 10గంటలకు ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా 86వ జయంతి సందర్భంగా పలువురు ప్రొఫెసర్లకు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రతన్‌టాటా జీవిత చరిత్రపై నగరంలోని పలు ఎంబీఏ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుశోత్తం, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ పాల్గొంటారని రాజ్ నారాయణ్ ముదిరాజ్ పేర్కొన్నారు.

శ్రీవారికి చందనంతో
ప్రత్యేక అలంకరణ



నేరేడ్‌మెట్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామిని ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక చందన అలంకరణ చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు, అర్చకులు తులసి వెంకట రమణాచార్యులు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి శ్రీవారినిదర్శించుకున్నట్లు తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించినట్లు ఆలయ కార్య నిర్వాహణ అధికారి ఏ.రవీంద్రరెడ్డి , క్లర్క్ సుధాకర్ సంద్ర తెలిపారు.

గోపాల్‌నగర్‌లో ఏకలవ్య సొసైటీ భవన నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తాం: ఎమ్మెల్యే

మల్కాజిగిరి, డిసెంబర్ 26: బస్తీల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మచ్చ బొల్లారం డివిజన్ గోపాల్‌నగర్‌లో ఏకలవ్య సొసైటీ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ నియోజక వర్గంలోని బస్తీలు, కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తామన్నారు. ఇప్పటికే పూర్తికాని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణపనులు చేపడతామని అన్నారు.

సొసైటీలు సొంత నిధులతో భవనాలను నిర్మించడం హర్షణీయమని అన్నారు.

'కేంద్రం కార్మిక చట్టాలను కాలరాస్తున్నది'

మణికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మణికొండ, డిసెంబర్ 26: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. సీపీఎం పార్టీ గండిపేట్ మండలం–1 మహాసభలు గురువారం మణికొండ నెమలినగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎ.అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోరికల నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు అలిదే వేందర్‌లతో కలిసి రుద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయకుండా.. దేశంలో కులమతలతో రెచ్చగొడుతుందన్నారు. దేశాభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ పేద ప్రజల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టితే ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తుందన్నారు.

మండల కమిటీ ఎన్నిక...

సీపీఎం పార్టీ మండల కార్యదర్శిగా డప్పు ప్రవీణ్‌కుమార్, మండల కమిటీ సభ్యులుగా ఎం.అశోక్, మైపాల్‌యాదవ్, యాదగిరి, సుభాష్, భారతమ్మ, నాగేష్‌గౌడ్, బి.బాలరాజ్, రాజుగౌడ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులంతా రానున్న రోజుల్లో నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబరు 26: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోరూ.4.80 లక్షలతో చేపట్టిన భూగర్భ నీటి పారుదల వ్యవస్థ నిర్మాణ పనులకు మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, నాయకులు మెరుగు శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ మణికంఠా గౌడ్

మేడ్చల్, డిసెంబరు 26 : మేడ్చల్ మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని పెద్ద చెరువు మత్తడి వద్ద రూ.2 లక్షలతో చేపడుతున్న ట్యాంక్ నిర్మాణంతో పాటు గదుల నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ రామన్నగారి మణికంఠాగౌడ్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు మత్తడి వద్ద ప్రజల సౌకర్యార్థం నీటి ట్యాంకుతో పాటు రెండు గదులను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు
గురుకుల విద్యార్థినుల ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 26: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల(మహేంద్రహిల్స్)కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత తెలిపారు. ఈనెల 23 నుంచి తమిళనాడులోని దిండిగల జిల్లా కేంద్రం జేటీఎస్ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న 46వ జాతీయ స్థాయి బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్–2024 జరిగింది. గురుకుల కళాశాలకు చెందిన కే.అనూష, బి. కల్పనలు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. అనూష, కల్పనలతో పాటు కోచ్ పద్మిని గుప్తాను ప్రిన్సిపాల్ అభినందించారు.


జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు